ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 16 జనవరి 2025 | 5

కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు.. 7లో

# ఊరంతా సంక్రాంతి



## కోడి పందేల హోరు



అచ్చంపేట జంక్షన్‌లో ..

### కాకినాడ జిల్లాలో జూద జాతర

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో కోడిపందేల జాతర కొనసాగింది. పందెంరాయుళ్ల పోటీతో పుంజులు బరుల్లో పోటాపోటీగా తలపడ్డాయి. దీంతో కోట్లలో కట్టలు తెగిపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ బరుల్లో నువ్వానేనా అన్నట్లు పండగ మూడు రోజులో జిల్లాలో పందేలు జరిగాయి. మూడురోజులపాటు రేయింబవళ్లు కోడి పందేలు హోరెత్తాయి. సంక్రాంతి రోజైతే ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి మరీ పందెం రాయుళ్లు పోటీపడ్డారు. పందేలు కాయడానికి వచ్చే వారిని ఆకట్టుకునేందుకు భారీ షామియానాలు, కుర్చీలు, లైవ్‌షోలు, డ్యాన్సులు, విందు ఏర్పాటు చేయడంతో బరులన్నీ జాతరలను తలపించాయి. బరులను ఆనుకుని గుండాట వ్యాపారం కోట్లలో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు గుండాట బోర్డులు నిర్వాహకులకు కోట్లలో కాసులు కురిపించాయి.

### కాకినాడ జిల్లావ్యాప్తంగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా మూడురోజుల్లో కోడిపందేలు, గుండాట కలిపి రూ.250కోట్లకుపైగా వ్యాపారం జరిగింది. పోలీసులు సైతం బరులవైపు కన్నెత్తి చూడకపోవడంతో పందెంరాయుళ్లు బరితెగించేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా 490వరకు బరులు ఏర్పాట్లయ్యాయి. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో కోడి పందేల విజేతలకు బుల్లెట్లు, కారు బహుమతులుగా ఇవ్వడంతో పందెంరాయుళ్లు విరగబడ్డారు. తుని నియోజకవర్గం పరిధిలో కోటనందూరు, తుని, తొండంగిలో పోలవరం కాలువ వెంబడి, హైవే తోటల్లోను భారీగా బరులు నిర్వహించారు. పెద్దపెద్ద టెంట్లు, లైట్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. తుని నియోజకవర్గంలో పందేలు, గుండాట, పేకాట కలిపి రూ.15కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. ప్రత్తిపాడులో ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన గుండాట వ్యాపారికి మూడురోజుల్లో రూ.25లక్షల లాభం వచ్చింది. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో పామాయిల్ తోటల్లో మూడురోజులపాటు జరిగిన కోడిపందేలు, గుండాట జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచాయి. తెలంగాణనుంచి సైతం పందెంరాయుళ్లు రావడంతో ఒక్కో బరిలో కోట్లలో వ్యాపారం జరిగింది. జగ్గంపేటలో ఓ బరిని రూ.36లక్షలకు వేలంలో పాడుకున్న ఓ నిర్వాహకుడు అంతకు రెండింతలు గడించారు. సామర్లకోటలో ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. నియోజకవర్గంలో దాదాపు రూ.45కోట్ల వరకు లావాదేవీలు జరగ్గా గుండాట వ్యాపారమే రూ.32కోట్ల వరకు ఉంది. పిఠాపురం నియోజకవర్గం మొత్తం 80వరకు బరుల్లో పందేలు, గుండాట కలిపి రూ.25కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. కాకినాడ రూరల్‌లో ఒక్కో బరిని కొందరు రూ.30లక్షల నుంచి రూ.38లక్షలకు వేలంలో దక్కించుకోవడంతో పందెంరాయుళ్లను ఆకర్షించడానికి అనేక ఎత్తులు వేశారు. కరప మండలం కొరుపల్లిలో మూడురోజుల్లో అత్యధికంగా పందేలు గెలిచిన విజేత దేగల నాగేంద్ర అలియాస్ గోల్డ్‌బాబుకు రూ.18లక్షలు విలువ చేసే మహీంద్రా థార్ వాహనాన్ని నిర్వాహకులు అందజేశారు. పెదపూడి,తాళ్లరేవు,కాజులూరు మండలాల్లో రూ.5కోట్ల చొప్పున గుండాట వ్యాపారం జరిగింది.

## గుండాటల జోరు




### రూ.200 కోట్ల పందేల సందడి

రాజమహేంద్రవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు కోడిపందేలు, గుండాటలు, పేకాటల పేరిట రూ.200కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా. బరుల నిర్వాహకులకు గుండాట బోర్డులు తీసుకున్నవారు రూ.13కోట్ల వరకూ ఇచ్చారు. 18 మండలాల పరిధిలో ఒక్కో మండలానికి కనీసం 7 కోడిపందేల బరుల వంతున జిల్లాలో మొత్తం 125 బరుల వరకూ నడిచాయి. కోడిపందేల నిర్వాహకులు ముందుగా గుండాటలు, పేకాట నిర్వాహకులతో ఒప్పందం పెట్టుకున్నారు. గుండాట నిర్వాహకులు ఒక్కో బరికి కనీసం రూ.10లక్షలు ముందుగానే కోడిపందేల బరి నిర్వాహకులకు అందజేయాలని ఒప్పందం చేసుకున్నారు. రాజానగరంలో 10 గుండాట బోర్డులు పెట్టుకోవడానికి రూ.21లక్షలు నిర్వాహకులకు చెల్లించినట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులకు రూ.2.5కోట్ల నుంచి 3కోట్ల ముడుపులు అందినట్టు అంచనా. ఒక్కో బరి నిర్వాహకులు కనీసం 4 నుంచి 6 కేసులు పోలీసులకు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. భోగి నుంచి మొదలైన పందేలు కనుమరోజు సాయంకాలం ఐదుగంటలకే ముగియాల్సి ఉన్నా చాలాచోట్ల ఆరు, ఆరున్నర గంటలకు నిలిపివేశారు.

### కోనసీమ జిల్లాలో కోట్లాట

#### చేతులు మారిన కోట్లాది రూపాయలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా సంక్రాంతి మూడురోజు నిర్వహించిన జూదాలు, పందేల్లో రూ.75కోట్ల మేర చేతులు మారినట్టు సమాచారం. పందేలు, రికార్డింగ్ డ్యాన్సులు యథేచ్ఛగా నిర్వహించినా కొందరు పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మురమళ్ల, చెయ్యేరు, కేశనకుర్రుపాలెం, రాజుపాలెం, రేళ్లపాలెం, గెద్దనపల్లి, గోడి, గోడిలంక, కామనగరువు, సమనస, పేరూరు, ఇందుపల్లిగరువు, రావులపాడు, వెదిరేశ్వరం, శివకోడు, మామిడికుదురు, అల్లవరం, రాణేలంక, కొత్తలంక, లొల్ల, పేరవరం, తాడిపూడి, ర్యాలి, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లిల్లో జాతీయ రహదారిని ఆనుకుని శివకోడు, వీవీ మెరక సబ్‌స్టేషన్, గున్నేపల్లి అగ్రహారం, కొంకాపల్లి, నడవపల్లి, గోగన్నమఠం, పాశర్లపూడి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంకతో పాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధితో సహా 400కుపైగా కీలక ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కీలక బరులు వద్ద కోడిపందాలు, గుండాట, పేకాట వంటి పోటీల ద్వారా కోట్లాది రూపాయిల మేర లావాదేవీలు జరిగినట్టు అంచనా. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతోపాటు అనేకమంది కూటమికి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై తిలకించారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌లో సంక్రాంతి సంబరాల పేరిట ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఉత్సవాల్లో కోడిపందేలు, గుండాట, బైక్ రైడింగ్‌లతోపాటు రాత్రివేళల్లో జబర్దస్త్ బృందాల ఆధ్వర్యంలో డ్యాన్సులు, హాస్యవల్లరి కార్యక్రమాలు నిర్వహించారు. రాజోలు మండలం పాలగుమ్మిలో పందెం బరి వద్ద రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలో పలుచోట్ల సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు హోరెత్తించాయి.



రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో



కొవ్వూరు మండలం పశివేదలలో..



ఐ.పోలవరం: పోటీలను తిలకిస్తున్న నేతలు



కరప: గొర్రిపూడి బరిలో గుండాట



తాళ్లపూడి:పందెంలో గెలుచుకున్న బుల్లెట్



కరప: జీపును గెలుచుకున్న గోల్డ్‌బాబు



రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కోడి పందాల విజేతకు బుల్లెట్ బహుమతి

## కొత్తపేటలో ప్రభల సంబరం



కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద కొలువుదీరిన ప్రభలు



కొత్తపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం వేలాది జనసందోహం మధ్య అంబరాన్నంటింది. రాష్ట్రం నలుమూలలు నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం ప్రభల ఉత్సవాన్ని తిలకించేందుకు విచ్చేశారు. బోడిపాలెం, కొత్త, పాత రామాలయం వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రభలను ఊరేగింపుగా తీసుకురాగా వాటి ముందు మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాలు, సంగీత విభావరులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రభలు ముందుకు నడిచాయి. భక్తుల సందర్శనార్థం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రభలు కొలువయ్యాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, ఏపీ బీజేపీ ప్రచారక్ విజయ ఆదిత్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు మొక్కుబడులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ వైగోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## వేడుకగా సత్యదేవుడి ప్రభల ఉత్సవం



అన్నవరంలో ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడి ప్రభ

అన్నవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం సత్యదేవుడి ప్రభలోత్సవం వేడుకగా జరిగింది. సాయంత్రం 7గంటలకు స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి కొండదిగువన ఉన్న పురగిరి క్షత్రియ రామాలయం వద్దకు తొడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామిఅమ్మవార్ల చెంత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల వేదాశీర్వచనం తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు



అమలాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు జోరందుకున్నా యి. రాజోలు పోలీసు సర్కిల్ పరిధిలోను, మామిడికుదురు మండలం గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు, మగటపల్లి, కరవాక, రాజోలులో పలుచోట్ల, మలికిపురం మండలంలోని కేశనపల్లి, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, కేశవ దాసుపాలెంలో రికార్డింగు డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు హోరెత్తాయి. మగటపల్లిలో ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## జనసంద్రంగా సాగర తీరం

### కాకినాడ సూర్యారావుపేట బీచ్‌కు పర్యాటకుల తాకిడి

సర్పవరం జంక్షన్, జనవరి 15: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సోమ, మంగళ, బుధవారం మూడురోజులపాటు కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సాగర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగరోజున సొంత గ్రామాలకు వచ్చిన గ్రామస్థులు, బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి ఆహ్లాద వాతావరణంలో గడిపించేందుకు ఎన్టీఆర్ బీచ్‌కు జిల్లా నలుమూలలనుంచి వేలాది మంది సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పెద్దలు, యువతీ, యువకులు సముద్ర స్నానాలాచరిస్తూ ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు బీచ్‌లో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. బీచ్‌లో యువతీ, యువకులు సముద్రంలో ఈతకొట్టేందుకు లోతుకు వెళ్లకుండా కాకినాడ మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ అబ్బారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గజ ఈతగాళ్లతో హెచ్చరికలు చేస్తూ పర్యాటకులను అప్రమత్తం చేశారు. సందర్శకుల రద్దీతో బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పర్యాటకుల తాకిడి కారణంగా ఉప్పాడ-కాకినాడ రహదారి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు కాస్త ఇబ్బందిపడ్డారు.



కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో సందర్శకుల కోలాహలం



ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

# ప్రభయమానం



పంటచేలను దాటుతున్న వీరేశ్వరస్వామివారి ప్రభ



## జగ్గన్నతోటలో అంగరంగ వైభవంగా ప్రభల తీర్థం

అంబాజీపేట, జనవరి15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోట, వాకలగరువు, చిరతపూడిలో సంక్రాంతి, కనుమ రోజు ప్రభల తీర్థాలు వైభవోపేతంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మరింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలివచ్చాయి. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వర స్వామి ప్రభ ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుదీరి స్వాగతం పలికింది. కౌశిక అవతల వైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలోకి ప్రవేశించిన ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకుర్తి వారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరువు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుతీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.

వీరేశ్వరస్వామి ప్రభ







అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు, జి.అగ్రహారం ప్రభలు



### ఏకాదశ రుద్రుల కొలువు

జగ్గన్నతోటలో ఒకే చోట ఏకాదశ రుద్రులను ఒకే రోజు దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఏకాదశ రుద్రుల ఉత్సవంలో అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల 11 గ్రామల నుంచి ప్రభలు మేళతాళ మంగళవాయిద్యాలతో ఉత్సవంలో కొలువుతీరాయి. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలంగా భావించి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

### అధికారుల సేవలు భేష్

పోలీసులు ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో జీవీ సరోవర్, తహశీల్దారు జె.వెంకటేశ్వరి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అప్పర్ కౌశిక వద్ద ఇసుక బస్తాలు, తాగునీటి సౌకర్యంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక సౌకర్యాలు చేపట్టారు.

### లక్షకు పైగా..

జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు జగ్గన్నతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చినట్టు అంచనా.. జగ్గన్నతోట తీర్థంలో యువతి, యువకులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. తీర్థంలో రెండెడ్ల బండ్లు సందడి చేశాయి. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు పంటచేలను తొక్కుకుంటూ, అప్పర్ కౌశిక దాటుతున్న దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో బంధించారు.



# ఆతిథ్యం ఇచ్చి ఆహా అనిపించి

గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి కొత్త అల్లుళ్లకు జరిగే మర్యాదలు అంతా ఇంతా కాదు.. పండక్కి అత్తవారి ఇంట్లో జరిగే అతిథి మర్యాదలతో పాటు వంటకాలు ఆహా అనిపించేలా ఉంటాయి. ఈ సారి కూడా పలుచోట్ల కొత్త అల్లుళ్లకు అదిరిపోయే ఆతిథ్యమిచ్చారు

### 660 రకాలతో...

అల్లవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలో కొత్త అల్లుడికి సంక్రాంతి పండుగ సందర్భంగా 660 రకాలతో విందు ఏర్పాటు చేశారు. స్వీట్లు, స్నాక్స్ వివిధ పానీయాలు, వెరైటీ పచ్చళ్లు, డ్రై ఫ్రూట్స్, తిరుపతి, అన్నవరం, విజయవాడ, అయినవిల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్రసాదాలు ఈ విందులో ఉన్నాయి. అల్లవరంలో జంగా వెంకటరత్నంనాయుడు (బుజ్జి) హైదరాబాద్‌కు చెందిన అల్లుడు గంధం హేమంత సాయిదుర్గాప్రసాద్ కోసం ఈ విందు ఏర్పాటు చేశారు. జర్మనీలో దుర్గాప్రసాద్ హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.



### 200 రకాలతో...

కపిలేశ్వరపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన గ్రంధి గోవిందరాజులు, మంగతాయారు దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తమ అల్లుడికి 200కు పైగా పిండివంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాగా అల్లుడు పసుమర్తి గణపతి గుప్త, కూతురు తేజస్వినిల తల్లిదండ్రుల స్వగృహాలు అంగర, ఏడిద కాగా గోవిందరాజులు, మంగతాయారు దంపతులు ఈ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు.

### 72 రకాలతో...

ఆలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కంచర్ల సూర్యనారాయణ ఇంట్లో సంక్రాంతికి వచ్చిన అల్లుళ్లు నవీన్, పవన్‌లకు 72 రకాల వంటకాలను వండించి సంక్రాంతి రుచులతో అదరగొట్టారు. భారీ అరటిఆకులో అల్లుళ్లు, కూతుళ్లకు ఒకేసారి వడ్డించారు.



# అనపర్తిలో అంబరాన్నంటేలా...

**వైభవంగా వీరుళ్లమ్మ జాతర**
**అమ్మవారిని దర్శించుకున్న లక్ష మందికి పైగా భక్తులు**
**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా**





జాతరలో బాణసంచా కాల్పుల దృశ్యాలు

అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి అంబరాన్నంటింది. సంక్రాంతి రోజు రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. రాత్రి 8 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధులు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంత రం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న గరగను తలకెత్తుకుని ఎమ్మెల్యే జాతర ఉత్సవాలను ప్రారంభించారు. సుమారు లక్షమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గరగ నృత్యాలతో బాటు, వివిధ ఆర్కెస్ట్రాలు, కోయ మేళాలు వంటి వి ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ కళాకారులు ఆక ట్టుకున్నారు. అదేవిధంగా బాణసంచా కాల్పుల పోటీలు భక్తులకు కనువిందు చేశాయి. హైదరాబాద్ ఎగ్జిబిషన్ పేరుతో ఏర్పాటు చేసిన కొలంబస్, జెయింట్ వీల్, చిన్నారులకు బోటింగ్ వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. బుధవారం అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర సారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, చింతా ప్రకాశరెడ్డి, బెండమూరి రాజు, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులున్నారు.



అనపర్తిలో గరగనెత్తుకుని జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

# వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. సంక్రాంతి, కనుమ 2రోజులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది స్వామిని దర్శించుకున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకోగా ఫొటోపాట్ల వద్ద భక్తజన సందడి కనిపించింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి 2 రోజుల్లో రూ.9 లక్షల 46 వేల 408 ఆదాయం లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు

# పండుగ పూట కబళించిన మృత్యువు

**భోగిమంటలో పడిన వ్యక్తి మృతి**

వై.రామవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రెండు కాళ్లు లేకున్నా ఆత్మస్థైర్యంతో బ్రతుకు నీడ్చుకొస్తున్న అతడిని పండుగ పూట మృత్యువు కబళించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరానికి చెందిన పడాల నాగబాబు (49) సోమవారం అర్ధరాత్రి దాటక ఇంటి ముందు వేసిన భోగి మంట వద్ద కూర్చునేందుకు వెళ్లాడు. పీటపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. గతంలో అతడికి కాళ్లకు వ్యాపించిన వ్యాధులు కారణంగా రెండుసార్లు రెండు కాళ్లు తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్న అతడు భోగి మంటలో పడి మృతి చెందడంతో విషాదం నెలకొంది. నాగబాబును భార్య, కుటుంబీకులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని బుధవారం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



మృతిచెందిన నాగబాబు

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సతీష్‌కుమార్ మృతదేహం, (ఫైల్ ఫొటో)

తుని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన అలమండ సతీష్‌కుమార్ (40) సోమవారం తెల్లవారుజామున తుని నుంచి డి.పోలవరం బైక్‌పై బయల్దేరాడు. తుని-నర్సీపట్నం రోడ్డులో డి.పోలవరం గండి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.200 ఇవ్వలేదని నిప్పంటించుకున్నాడు

**ఖండవల్లిలో గుండాట వద్ద ఘర్షణ**

పెరవలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన గుండాటలో సొమ్ములు గెలుచుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఒక యువకుడు ఆవేశానికి గురై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన పెరవలి మండలం ఖండవల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంక్రాంతి సందర్భంగా ఖండవల్లిలో కోడిపందాల శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడే గుండాటలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి గంగాధర్(18) గుండాట ఆడుతూ రూ.200 కాశాడు. అయితే తాను గెలిచినప్పటికీ రూ.200 ఇవ్వకపోవడంతో గుండాట నిర్వాహకులతో తగవుపడ్డాడు. నీవు గెలవలేదని, నీకు డబ్బులు ఇవ్వాల్సినపనిలేదని నిర్వాహకులు చెప్పడంతో ఆవేశానికి గురైన యువకుడు మోటార్‌సైకిల్ నుంచి పెట్రోలు తీసి మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం భయాందోళనకు గురై పక్కనే ఉన్న నీళ్ల బోదెలోకి దూకాడు. అప్పటికే శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించారు. అతడి ప్రాణాలకు ఏ ఇబ్బంది లేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఏ కేసు నమోదు చేయలేదు. ఇక్కడ కోడిపందాల శిబిరాన్ని ఈ సంఘటన జరిగిన అనంతరం మూయించివేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్

# నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

**భోగాపురంలో**

**నాలుగురోజుల పాటు నిర్వహణ**

పిఠాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం కళాపరిషత్ తృతీయ వార్షిక నాటక మహోత్సవంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయ స్థాయి నాటిక పోటీలు, వారాహి రంగస్థల విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరగనున్నాయి. 19 వరకూ ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నారు. 16న రాత్రి గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ద్వారబందాల చంద్రయ్యనాయుడు నాటిక, గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం మిట్టపాలెం కృష్ణా ఆర్ట్స్ థియేటర్స్ కళాకారులు ప్రేమించే వయసేనా నాటిక ప్రదర్శిస్తారు. 17న రాత్రి విశాఖపట్టణం ఉక్కునగరం చైతన్య స్రవంతి కళాకారులు అసత్యం నాటిక, విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ఆంగికం భువనం యస్య నాటిక, హైదరాబాదు మిత్ర క్రియేషన్స్ కళాకారులు ఇది రహదారి కాదు నాటిక, 18న రాత్రి హైదరాబాదు తెల్లాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కుసంకెళ్లు నాటిక, యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు నా శత్రువు నాటిక, కర్నాటకలోని బళ్లారి జీఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు చీకటి బ్రతుకులు నాటిక, 19న రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి నాటికలు ప్రదర్శిస్తారు. అనంతరం ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. తర్వాత బహుమతి ప్రదానోత్స వం జరుగుతుంది. నాటిక పోటీలకు కళాభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని భోగాపురం నాటక కళా పరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు కోరారు.



## భారీ బండి.. వచ్చేనండి!

చెన్నై నుంచి ఒడిస్సాకు వెళ్తున్న 120 చక్రాలతో కూడిన భారీ వాహనం రాజానగరం హైవేపై బుధవారం కనిపించింది.
- రాజానగరం

# క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

**● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీలు**



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రాత్రి రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాత్రి బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ కోనసీమ ఆధ్వర్యంలో నిర్వహించే 14వ ఆల్‌ఇండియా, 20వ ఏపీ బాస్కెట్‌బాల్ టోర్నమెంటును మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులకు విద్య, ఉద్యోగ నియామకాల్లో కోటా పెంపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రామచంద్రపురంలో చాలా ఏళ్లగా సంక్రాంతికి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఖేల్ ఇండియా పథకంలో అమలాపురం పార్లమెంటులో స్టేడియంలు, క్రీడా ప్రాంగణాలు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడారు. క్రీడాకారులను మంత్రి, ఎంపీ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, లయన్ జి.వి.రావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్కంఠగా పోటీలు**

బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం లీగ్ స్థాయి పోటీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్,చండీఘడ్, ఛత్తీస్‌ఘడ్, చెన్నైకు చెందిన మెన్ అండ్ ఉమెన్ జట్లు పాల్గొంటున్నాయి.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

# పురందరదాసు సంకీర్తనల ప్రాచుర్యానికి కృషి

**8,600 మహిళ భక్తిమండల గ్రూపులు**
**దాససాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ ఆనందతీర్థాచార్యులు**



మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు

ఆలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు సంకీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషి చేస్తుందని దీనిలో భాగంగా 8,600 మహిళభక్తి మండల గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రాజెక్టు ఆఫీసర్ పి.నందరతీర్థాచార్యులు తెలిపారు. కోనసీమ జిల్లా ఆలమూరు విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. ఈ గ్రూపుల్లో ప్రస్తుతం 4500 యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. నూతన గ్రూపుల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చామని, ఇందుకోసం వెబ్‌సైట్ నిర్మాణ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. దక్షిత భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందని, పురందరదాసు 4.75లక్షల సంకీర్తనలు రచించారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 47ఏళ్ల క్రితం టీటీడీ దాససాహిత్య ప్రాజక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందర దాసు కీర్తల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తున్నామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించేవిధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. దాససాహిత్య ప్రాజక్టుకు గతేడాది టీటీడీ ద్వారా రూ.2.30కోట్లు బడ్జెటు కేటాయించారని, ఈ సంవత్సరం మార్చిలో బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు. బడ్జెట్ పెంచితే దక్షణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాలలో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ప్రాజక్టు ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి తదితరులు ఉన్నారు.

# 'పాదగయ'లో సినీ నటుడు ఆది పూజలు



సినీనటుడు ఆదికి స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

పిఠాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని బుధవారం ప్రముఖ సినీనటుడు ఆది సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆదిని ఆలయ మర్యాదలతో ఈవో జగన్మోహన శ్రీనివాస్ సత్కరించి శేషవస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

# ఆకట్టుకున్న వేషధారణలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సంక్రాంతి, కనుమ సంబరాల్లో భాగంగా ఎడ్ల బండ్లపై ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణవేషధారణలు, నరకాసుర సంహారం, దేవతామూర్తుల వేషధారణలతో కళాకారులు అలరించారు. గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్లపై వేషాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. రాత్రంతా బళ్ల వేషాలు కొనసాగాయి. పూర్వం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో వీటిని ఏటా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బళ్ల వేషాలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి అధికంగా ప్రజలు తరలివచ్చారు.





చేబ్రోలులో ఎడ్లబండ్లపై వివిధ దేవతామూర్తుల వేషధారణలలో కళాకారులు

# కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం



ఆలయంలో కిరీటం అందజేస్తున్న దాతలు

కోరుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి రూ.16 లక్షలు విలువ గల బంగారు కిరీటాన్ని బహూకరించారు. ఈ మేరకు స్వామివారి ఆలయ ముఖ మండపం నందు బంగారు కిరీటాన్ని ఉంచి ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన వీణవల్లి శ్రీనివాస్, ఉషారాణి దంపతులు ఈ బంగారు కిరీటాన్ని అందజేశారు. గతంలో లక్ష్మీదేవికి బంగారు కిరీటం ఉండేదని అయితే లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం అందజేయాలని సంకల్పించుకున్నామన్నారు. దీని ప్రకారం బంగారు కిరీటాన్ని ఆలయంలో పూజ అనంతరం అర్చక స్వాములకు అందజేసినట్టు ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో అనువంశక అర్చక స్వాములు పెద్దింటి సత్తిబాబు, పెదపాటి గిరిధరా చార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన హోంగార్డు



వికాస్ పాండే నుంచి వివరాలు సేకరిస్తున్న మెరైన్ పోలీసులు

సర్పవరం జంక్షన్, జనవరి 15 ( ఆంధ్రజ్యోతి): సరదాగా సముద్ర స్నానం చేస్తోండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు ప్రాణాలకు తెగించి రక్షించిన సంఘటన సూర్యారావుపేట బీచ్‌లో బుధవారం జరిగింది. వికాస్ పాండే అనే వ్యక్తి జీవనోపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి రాజమహేంద్రవరం వచ్చి భవనాలకు ఆల్టెక్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలసి బుధవారం మధ్యాహ్నం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చాడు. పలు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి పాండే కొట్టుకుపోతుండంతో స్నేహితులు హాహాకారాలు చేశారు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న వాకలపూడి మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ రామోహ్మన్ రెడ్డి ఈ విషయాన్ని గుర్తించి ఎస్ఐ సురేష్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రాణాలకు తెగించి హోంగార్డు కె.గంగాధర్ (హెచ్‌జీ 408) సముద్రంలోకి వెళ్లి పాండేను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చాడు. సముద్రం నీరు మింగేసిన పాండేకి మెరైన్ పోలీసులు సపర్యలు చేసి కోలుకునేలా చేశారు. ప్రాణాలకు తెగించి వికాస్ పాండేని కాపాడిన హోంగార్డు గంగాధర్‌కు బహుమతి ఇచ్చి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. బందోబస్తు విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులను అభినందించారు.



హోంగార్డు గంగాధర్‌కి బహుమతి ఇచ్చి సత్కరిస్తున్న మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి

**మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో...**

## 19న రాజమహేంద్రిలో వివాహ పరిచయ వేదిక

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నారు. గోదావరి గట్టున గల మల్లిగ సత్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ వివాహ పరిచయ వేదికకు ప్రముఖ ఆడిటర్ అంగర లక్ష్మీ నరసింహారావు అధ్యక్షత వహిస్తారు. కానుగోని వాసుదేవాచార్యులు వధూవరుల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మధ్వ వధూ వరులు తమ తల్లిదండ్రులతో రావాలని మధ్వ సమాఖ్య బుధవారం ఒక ప్రకటనలో కోరింది.

### వృద్ధులకు చీరల పంపిణీ

కరప, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నడకుదురు జనావళి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాలు అందజేశారు. యంగ్‌మైండ్స్ సభ్యులు కామేష్, రామకృష్ణ, వి.వీరభద్రరావు, రమేష్ పాల్గొన్నారు.

## ఉరుస్ షరీఫ్ గంధోత్సవానికి సర్వం సిద్ధం

- ఈనెల 20 నుంచి 22 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లలో దర్గా కమిటీ నిమగ్నం



గంధోత్సవానికి ముస్తాబైన దర్గా

పెద్దాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, హజరత్‌షా రహమతుల్లా వార్ల ఉరుస్ షరీఫ్ గంధోత్సవం ఈనెల 20 తేదీ నుంచి 22వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మమద్ లాయక్ అలీ తెలిపరు. 350 ఏళ్ల ఘనచరిత్ర కలిగిన ఈ గంధోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి కులమతాలకతీతంగా పెద్ద సంఖ్యలో వేలాదిగా తరలివచ్చే అశేష భక్తజనులకు ఏ ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గంధోత్సవంలో భాగంగా ఈనెల 20న ముస్లిం అంజుమన్ వ్యవస్థాపకుడు ఎంఏ సత్తార్ గృహం నుంచి గంధం ఊరేగింపు మేళతాళాలతో బయలుదేరి దర్గాకు చేరుకుంటుందని, హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక పచ్చటి వస్త్రాన్ని బాబా వారికి అలంకరించి ఖురాన్ పఠనం అలాగే గంధాన్ని సమాధికి పూస్తారని చెప్పారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ గంధోత్సవంలో కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పాల్గొంటారన్నారు. అలాగే దర్గా వద్ద ఖురాన్ ఖానీ, ఫాతేహాఖానీ, వాజ్, ఖవ్వాళీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## జోరుగా కోడిపందాలు





పిఠాపురంలో జరిగిన కోడిపందాలు, సామర్లకోటలో తలపడుతున్న కోళ్లు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంప్రదాయం పేరిట కోడిపందాలు జోరుగా సాగాయి. పందాలు మాటున గుండాట, జూదాలు యదేచ్ఛగా నిర్వహించారు. లక్షలాది రూపాయిలు చేతులు మారాయి. ఎక్కడిక్కడ బహిరంగంగా శిబిరాలు వేసి పందాలు నిర్వహిస్తున్నా, హెచ్చరికల పేరుతో హడావుడి చేసిన పోలీసులు ఫిర్యాదులు చేసినా స్పందించలేదు. డ్రంక్ డ్రైవ్, వాహనతనిఖీల పేరుతో బీజీగా గడిపి ఇటువైపు చూడలేదు. పిఠాపురంలోని వైఎస్‌ఆర్ గార్డెన్స్, దత్తనగర్‌లతో పాటు మండలంలోని పి.దొంతమూరు, రాయవరం, రాపర్తి, చిత్రాడ, జల్లూరు, మల్లాం, కందరాడ, జములపల్లి, విరవ, విరవాడ, నరసింగపురం తదితర గ్రామాలు, గొల్లప్రోలులోని తాటిపర్తి రోడ్డు, కరణంగారితోట ప్రాంతాలు, చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలి తదితర గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారు.

**కోసకు గిరాకీ**

పందెం కోడి మాంసాని(కోస)కి గిరాకీ పెరిగింది. కోస మాంసం కోసం ఎంత రేటైనా వెచ్చించేందుకు ప్రజలు సన్నద్ధం కావడంతో అధిక ధరలకు విక్రయించారు. పందెం కోళ్ల ధరలు రూ.5వేలు నుంచి రూ.15వేల వరకూ పలికాయి.

**సామర్లకోట:** మండలంలో కోడిపందాలు, గుండాలు, పేకాటలు 3రోజుల పాటు జోరుగా నిర్వహించారు. మేజర్ పంచాయతీ అయిన వేట్లపాలెం మినహా మిగిలిన జీ.మేడపాడు, వీకె.రాయపురం, ఉండూరు, అచ్చంపేట, పనసపాడు, రావువారి చంద్రంపాలెం, మాధవపట్నం గ్రామాల్లో కోడిపందాలు, గుండాట పెద్దఎత్తున నిర్వహించారు. అన్ని గ్రామాలలో మద్యం విక్రయాలు జోరుగా చేపట్టారు. అసాంఘిక క్రీడాజూదాల ను నిరోధిస్తామని హడావుడి చేసిన పోలీసులు భోగి రోజు ఉదయం నుంచి మౌనం దాల్చడమే గాక ఆయా పందాల వద్దకు ఇతరత్రా పనుల కోసం పోలీసులు మఫ్టీలలో తిరగడం పలువురిని విస్మయపరిచింది.

**తాళ్లరేవు:** మండలంలో కోడిపందాలు, గుండాటలు 3రోజులపాటు జోరుగా సాగాయి. పిల్లంక, సుంకరపాలెం, నీలపల్లి, పోలేకుర్రు, సీతారామపురం, చినవలసల, పటవల, జి.వేమవరం, చొల్లంగిపేట గ్రామాల్లో పందెం బరులను ఏర్పాటుచేసి అధికార పార్టీ కార్యకర్తలు ఆడించారు.

**పెద్దాపురం:** మండల గ్రామాల్లో కోడి పందాలు యథేచ్ఛగా సాగాయి. కేవలం 3 రోజుల్లో లక్షల రూపాయలు చేతులుమారాయి. పైగా కాళ్లకు కత్తులు కట్టకూడదన్న నిషేధం ఉన్నా అవి ఎక్కడా అమలు జరగలేదు. రాజకీయ నాయకులు, పోలీసులు అండదండలు పుష్కలంగా ఉండడంతో పందెం రాయుళ్లు బరితెగించారు. కొన్నిచోట్ల ఆఖరి నిమిషంలో పోలీసులు గుండాట శిబిరాలను తొలగించి మొక్కు బడిగా కేసులు నమోదు చేసి మమ అనిపించారు.

**సర్పవరం జంక్షన్:** కాకినాడ రూరల్ మండలంలో కోళ్ల కత్తులు దూశాయి. 3 రోజుల పాటు వలసపాకల, సర్పవరం, తిమ్మాపురం, నేమాం, పండూరు, సూర్యారావుపేట, కొత్తూరు, చీడిగ, తూరంగి తదితర గ్రామాల్లో నిర్వహించిన కోడి పందాలు, గుండాటల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కోడి పందాలను వీక్షించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటూ తెలంగాణా నుంచి అధిక సంఖ్యలో కుటుంబసభ్యులతో తరలివచ్చారు. పందాలు, గుండాట నిర్వహణలో లోపాలు తలెత్తడం, బరుల్లో పందాలు గెలుపు ఓటముల్లో వాగ్వాదాలు చోటు చేసుకోవడంతో చీడిగ, సూర్యారావుపేట, వలసపాకల తదితర చోట్ల గందరగోళం, వాగ్వాదాలు జరిగాయి. తిమ్మాపురంలో అధిక పందాలు కైవసం చేసుకున్న వారికి నిర్వాహకులు బుల్లెట్ బైక్‌ను బహుమతిగా అందించారు.

**ఆగని గుండాట, జూదాలు**

**స్టేషన్లకే పరిమితమైన పోలీసులు**

**నామమాత్రంగా కేసులు నమోదు**

**కొత్తపల్లి:** మండలంలో పలు గ్రామాల్లో భోగి నుంచి కనుమ పండుగ వరకు కోడి పందాలు, గుండాటలు జోరుగా జరిగాయి. కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, కొమరగిరి తదితర గ్రామాల్లో భారీగా కోడి పందాలు జరిగాయి. పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రతిపక్ష పార్టీలనాయకులు విమర్శిస్తున్నారు. మండలంలో కోడిపందాలు, గుండాటలు నిర్వహించిన 52 మందిపై కేసులు నమోదు చేసినట్టు కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ తెలిపారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

**కరప:** మండలంలోని కొరుపల్లి, గొర్రిపూడి, గురజనాపల్లి, కొంగోడు, విజయరాయుడుపాలెం, వేళంగి, వేములవాడ, పెదకొత్తూరు గ్రామాల్లో గత 3 రోజులుగా గుండాట, కోడిపందాలు యధేచ్ఛగా నిర్వహించారు. కరప-పెనుగుదురు ప్రధానరహదారిని చేర్చి కొరుపల్లి పరిధిలో కోడి పందాలు భారీఎత్తున జరిగాయి. మూడు రోజుల బాటు 60 జోడిపందాలు నిర్వహించారు. కోడిపందాల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి. యధేచ్ఛగా కోడిపందాలు జరిగినా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.

## ఘనంగా సంక్రాంతి, కనుమ సంబరాలు



కొత్తపల్లిలో గంగిరెద్దుకు పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతీ ఒక్కరూ కొత్త దుస్తులు ధరించి ఆనందోత్సాహల మధ్య ఉత్సాహంగా గడిపారు. అలాగే గ్రామాల్లో కోడి పందాలు, డూడూ బసవన్నల ఆటలు, జంగమదేవరలు సందడి చేశారు. యువకులు పలు సంప్రదాయ క్రీడలతో సందడిగా గడిపారు. పిండి వంటలు భుజించి కొత్త అల్లుళ్లు, బంధువులతో ప్రతీ ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా, పీఎన్ఎం, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగా యి. స్థానిక నువ్వులగుంట వీధి, వరహాల య్య పేటలో ముగ్గుల పోటీలు, స్లోసైక్లింగ్, మ్యూజికల్ చైర్, కుండ కొట్టుడు, స్నేకర్ రేస్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతా యారు అందచేశారు. కూనిరెడ్డి రవికుమార్, రొంగల అరుణ్, దారపురెడ్డి కృష్ణ, కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి క్రాంతికుమార్, కృష్ణ పాల్గొన్నారు.





పెద్దాపురంలో ఆటలో పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**గొల్లప్రోలు:** పట్టణంలో సంక్రాంతి, కనుమ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజలు ఉదయమే స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లారు. కనుమ పండుగ సందర్భంగా గోవులకు పసుపు, కుంకుమ రాసి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పలువురు ఇళ్ల వద్దే నైవేద్యాలు సమర్పించారు.

**కొత్తపల్లి:** మండలంలో ప్రజలు కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. యాదవుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఊరేగించే గంగిరెద్దులకు కుంకుమ, బొట్టు పెట్టి పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో తయారుచేసిన పిండివంటలు, బియ్యాన్ని గంగిరెద్దుకు తినిపిస్తూ పూజలు చేశారు.

**సామర్లకోట:** పట్టణంలో సత్యనారాయణపురంలో మంగళ, బుధవారాల్లో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సేపేని సురేష్ ఆధ్వర్యంలో మహిళా నాయకురాలు రూప పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో జూనియర్, సీనియర్ కేటగిరిలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మార్తల విజయలక్ష్మి, కరణం శ్రీనివాస్, కర్రి బాబూరావు, బావిశెట్టి వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో...

## నాలుగు ద్విచక్ర వాహనాలకు నిప్పు



కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

కాకినాడ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగు మోటారు బైకులను అగంతకులు నిప్పు పెట్టి దగ్ధం చేసిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. స్థానిక కొండయ్యపాలెంలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలను దుండగులు దగ్ధం చేశారు. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా దగ్ధం కాగా మరో రెండు వాహనాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఘటన చోటు చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 8 అడుగుల విస్తరాకులో కుటుంబ భోజనం

**పండుగ పూట**

**పిఠాపురంలో సందడి**





పిఠాపురంలో 8 అడుగుల విస్తరాకులో భోజనం చేస్తున్న కుటుంబ సభ్యులు

పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పండుగ వేళ కుటుంబమంతా ఒకే చోటకు చేరి ఎనిమిది అడుగుల విస్తీర్ణంలో మండీ భోజనం చేశారు. పిఠాపురంలోని సియాదుల సోమేశ్వరరావు, సీతారత్నం కుమారులు, కోడళ్లు, అల్లుళ్లు, కూతుళ్లు ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వేర్వేరు ప్రాం తాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగ వేళ ఏటా కలుసుకునే వీరు అదే మాదిరిగా ఈ సారి కలిశారు. కనుమరోజు బుధవారం రాత్రి 8 అడుగుల ఏకరీతి విస్తరాకులో ఒకేచోట కూర్చొని భోజనం చేశారు. నాన్‌వెజ్ వంటకాలతో అందరు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసి తమ అప్యాయతలను చాటుకున్నారు.

## బొడ్డు భాస్కరరామారావుకు ఘన నివాళి



భాస్కరరామారావు విగ్రహానిక గజమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటరమణ చౌదరి

సామర్లకోట, జనవరి15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావు జ యంతి వేడుకలు బుధవారం స్వగ్రామం వేట్ల పాలెంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ గ్రామ నాయకులు, రైతు సంఘ ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, శాగోమిల్లర్లు, తదితర టీడీపీ కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్య అతిథిగా హాజరై తండ్రి భాస్కరరామారావు విగ్రహానికి గజమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి, టీడీపీ నాయకులు కొండపల్లి బాబూరావు, గోలి వెంకట్రావుల విగ్రహాల వద్ద పూలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జీ.మేడపాడు కెనాల్ రోడ్డులో భాస్కరరామారావు విగ్రహానికి కూడా వెంకటరమణ చౌదరి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, గుమ్మళ్ళ రామకృష్ణ, వల్లూరి శ్రీనివాస్, రైతు సంఘ నాయకులు పాలకుర్తి బాసయ్య, బిక్కిన గోవిందు, వల్లూరి వెంకట్రావు, నున్న గొల్లబ్బాయి, మాసిన భద్రరావు, అమటం వెంకటేశ్వరరావు, రైస్‌మిల్లర్లు గుమ్మళ్ళ రాజు, గుమ్మళ్ళ సత్యనారాయణ, జొన్నాడ సందీప్, గుణ్ణం వీరభద్రరావు, గుణ్ణం సురేష్, గోలి వీరభద్రరావు, కొప్పిశెట్టి జగన్, గోలి బాబ్జీ, వై.రామకృష్ణ, త్సలికి పెదబాబు, కొండపల్లి సూరన్నచౌదరి, పాలచర్ల సతీష్ పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు: సీఐ

పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆటోలు నడిపే సమయంలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం ఆటోడ్రైవర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పార్కింగ్ చేయవద్దని సూచించారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపడం వాహనదారులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆటోలను ఆపాలని, లేకుంటే చట్టప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, అదనపు ఎస్ఐ జానీబాషా పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

తాళ్లరేవు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జామకాయలతూము రహదారిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందినట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జి.వేమవరం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి వీరభద్రరావు(45) ద్విచక్రవాహనంతో జామికాయలతూము నుంచి ఇంటికి తరిగి వెలుతుండగా దారి మధ్యలో వాహనం అదుపుతప్పి వాహనంతో కాలువలో పడి మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు. కోరంగి పోలీసులు మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'పవన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు'



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు

పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, మాలమహాగర్జన అధ్యక్షుడు దానం లాజర్‌బాబు విమర్శించారు. పిఠాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రాంతాల పేర్లను చెప్పి అక్కడ గంజాయి ఎక్కువగా అమ్ముతున్నారు, తుని నుంచి వచ్చిన వారు ఇక్కడి యువతను పాడు చేస్తున్నారని పవన్ వ్యాఖ్యానించారన్నారు. పవన్ ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, అందర్ని ఉద్దేశించి మన పిల్లలు జీవితాలు బాగు చేయాలని సదుద్దేశంతో అన్నారని తెలిపారు. తనకు వచ్చిన నివేదికను ఆధారంగా చేసుకునే పవన్ మాట్లాడారని చెప్పారు. దీనిపై నిరసనలు చేయడం అంటే అసాంఘిక కార్యాకలాపాలకు మద్దతు తెలిపినట్లవుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు మైనాబత్తుల చిన్నా, దేవా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా మకరజ్యోతి దర్శనం



పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కుమారస్వామి దేవస్థానంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మకరజ్యోతి (మకర విళక్కు) దర్శనం కన్నుల పండువగా జరిగింది. అయ్యప్పస్వామికి అభిషేకాలు, నూతన వస్త్ర అలంకరణ, పుష్పార్చన, పడిపూజ నిర్వహించారు. మకర జ్యోతిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత పాదగయ క్షేత్రంలో స్వామి దివ్యాభరణాలకు పూజాధికాలు నిర్వహించి మేళతాళాలతో అయ్యప్పస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాటిని ఆలయ అర్చకులకు అందజేశారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

పెద్దాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈజాతర మహోత్సవాల్లో భాగంగా గరగ నృత్యాలు, పెద్దపులి ఆటలు, కళ్లు మిరుమిట్లుగొలిపే బాణసంచా, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నిరుపేదలకు అండగా నిలిచింది ఎన్టీఆర్



చినజగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా వారికి అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. చినజగ్గంపేటలో గ్రామస్తులు, పార్టీ కేడర్ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ నిరంతరం పేద, బలహీన, అట్టడుగు వర్గాల కోసమే ఆలోచించే వారని, నేడు సీఎం చంద్రబాబు అదే బాటలో పయనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.


## వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి, రంగనాథస్వాముల కల్యాణం

పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): దేశంలో పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతోన్న పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవ స్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై గోదాదేవి, రంగనాథస్వాముల ఉత్సవమూర్తులను ఉంచి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవంలో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, కుంతీమాధవస్వామి, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కుంతీమాధవుని ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, గోదా అమ్మవారికి శ్రీచూర్ణం అర్చనలు నిర్వహించారు. గోదా అమ్మవారి మాడవీధి సేవ జరిగింది.

### 'పోసిన'కు తెలుగు కీర్తి జాతీయ పురస్కారం




గొల్లప్రోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణానికి చెందిన లలితా పీఠాధిపతి పోసిన సత్యనారాయణకు తెలుగు కీర్తి జాతీయ పురస్కారం లభించింది. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ బుక్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ సంయుక్తంగా పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ చైర్మన్, కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ నుంచి సత్యనారాయణకు బుధవారం సమాచారం అందించింది. విజయవాడలోని కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈనెల21న జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

### ధనుర్మాసోత్సవాలు

పిఠాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కనుమ రోజున స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, విశేష సహస్ర పుష్పార్చన నిర్వహించారు.

## ఘనంగా కావమ్మ, మారయ్య తిరునాళ్లు



కావమ్మ, మారయ్యలు

సామర్లకోట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో పురాతన ప్రసిద్ధి పొందిన కావమ్మ, మారయ్య తిరునాళ్ల ఉత్సవాలు మంగళ, బుధవారాలు వైభవంగా నిర్వహిం చారు. ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వరరావు, మారిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన తిరునాళ్ళ ఉత్సవాల్లో సామర్లకోట పరిసర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 14న మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వద్దిపర్తి నాగేశ్‌శర్మ పర్యవేక్షణలో అభిషేకం, అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి చిత్తూరు జిల్లా పులచెర్ల మండలం గేటుకడ బెస్త పల్లి వాస్తవ్యులు పూజితభరత్‌కుమార్, హేమలత, మునినరేంద్ర, శ్రీదేవి, దేవేందర్, వెంకటరాజేష్ ఆశీనులై కల్యాణోత్సవం నిర్వహించారు. బుధవారం అభిషేకం, అమ్మవారి గ్రామోత్సవం, సాయంత్రం పసుపు, కుంకుమతో సారె పంపిణీ నిర్వహించారు. 16న ఉదయం అభిషేకపూజలు, గ్రామోత్సవం, సారె పంపకం నిర్వహిస్తామన్నారు. 18,19తేదీల్లో అమ్మవారి గ్రామోత్సవంతో పూర్ణాహుతి నిర్వహిస్తామని నాగేశ్వరరావు, మారిబాబు తెలిపారు.

### హరిదాసుకు ఘన సత్కారం



పెద్దాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాల పరిరక్షణలో హరిదాసుల పాత్ర ఎనలేనిదని హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు పలువురు అన్నారు, కట్టమూరులో హిందూ ధర్మరక్షా సమితి, గ్రామస్థుల ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద హరిదాసును బుధవారం ఘనంగా సత్కరించారు. దనుర్మాసం ప్రారంభం మొదలు నెల రోజులు గ్రామాల్లో హరినామ సంకీర్తనలు చేస్తూ ఆధ్మాత్మిక ఉట్టిపడేలా చేయడంలో హరిదాసులు పాత్ర మరువలేనిదని ఆయనను కొనియాడారు.

### పూడికతీత పనులు పరిశీలించిన ఎమ్మెల్యే





సామర్లకోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రధాన డ్రైనలో పూడికతీత పనులు అమలుతీరును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పరిశీలించారు. సుదీర్ఘకాలంగా పూడికతీత పనులు నిర్వహించలేని ప్రధాన డ్రైన్ పూర్తిస్థాయిలో వెలుగుచూడడాన్ని గుర్తించారు. పట్టణంలో ముంపు బెడద శాశ్వతంగా తొలగిపోవాలంటే డ్రైన్లపై అక్రమకట్టడాలను మున్సిపల్ అధికారులు నిరోధించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



ప్రత్తిపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో పంచాయతీ కార్మికులకు ఎంఎంఆర్ ట్రస్టు అధినేత ముదునూరి మురళీకృష్ణంరాజు దుస్తులు అందజేశారు. సంక్రాంతి నెల పాటు హరినామ సంకీర్తనలు చేసిన హరిదాసును సన్మానించారు. ట్రస్టు నాయకులు ముదునూరి సీతారామ రాజు, బొల్లు నాగేశ్వరరావు, కోలా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు

## సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

దేవీపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మన పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఇందుకూరుపేట రామాలయం వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులకు రూ.10వేలు నగదు అందజేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

**దేవీపట్నం (ఆంధ్రజ్యోతి):** మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఇళ్లు కొత్త అల్లుళ్లు, బంధువులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో పూజలు జరిపి దర్శనాలు చేసుకున్నారు. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

**కూనవరం (ఆంధ్రజ్యోతి):** మండలంలో మూడు రోజుల పాటు ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో పల్లెలు కిక్కిరిసిపోయాయి. భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పిండి వంటలు ఆరగించారు. కొన్ని గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.



### గంగవరంలో గంగిరెద్దుల సందడి

**వీఆర్ పురం (ఆంధ్రజ్యోతి):** మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. స్నేహితులు, కొత్త అల్లుళ్లతో గ్రామాలు కళకళలాడాయి. గిరిజన సంప్ర దాయ రీతిలో జరిగిన పందాలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు.



పర్యాటకులతో కిక్కిరిసిన పేరంటాలపల్లి

## పాపికొండలు విహార యాత్రకు 3వేల మంది పర్యాటకులు

దేవీపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు పాపికొండలు విహార యాత్రకు మూడువేల మంది పర్యాటకులు వెళ్లినట్టు అధికారులు తెలిపారు. గురు, శుక్రవారాల్లో సుమారు 2వేల మంది ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన దేవీపట్నం, తొయ్యూరు, సీతారం, రమణయ్యపేట, డి.రావిలంక, నాగళ్లపల్లి, పూడిపల్లి గ్రామాలు పర్యాటక ప్రాంతాలుగా మారాయి. ముంపులో ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో బంధువులు అక్కడికి వెళ్లి గత స్మృతులను గుర్తు చేసుకుని ఫొటోలు దిగి కొంతసేపు సేదతీరారు.



వ్యూ పాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

## తులసిపాక వ్యూ పాయింట్‌కు పర్యాటకుల తాకిడి

మోతుగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ తులసిపాక వ్యూ పాయింట్‌కు పర్యాటకుల తాడికి ఎక్కువైంది. ఒక సమయంలో ట్రాఫిక్ కూడా అంతరాయం కలిగింది. పర్యాటక ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి జనాలు తండోపతండాలుగా వచ్చారు. విదేశీ పర్యాటకులు సందడి చేశారు.



స్వామివారిని తోడ్కొని వస్తున్న భక్తులు

## రామయ్యకు రాపత్తు సేవ

ఎటపాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం పురుషోత్తపట్నం గ్రామంలో స్వామివారికి సంప్రదాయబద్ధంగా రాపత్తు సేవ నిర్వహించారు. ముందుగా శ్రీసీతారామచంద్ర స్వామిని తీసుకువచ్చేందుకు పురుషోత్తపట్నం రైతులు భద్రాచలం వెళ్లారు. అక్కడి నుంచి స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు.



బోటును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సంతోష్

## పర్యాటక బోట్లలో లైఫ్ జాకెట్లు తప్పనిసరి

వీఆర్ పురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) పాపికొండలు-పేరంటాలపల్లి విహారయాత్ర బోట్లలో పర్యాటకుల రక్షణ కోసం లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ఉంచాలని వీఆర్ పురం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ బోట్ల నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి పోచవరం బోట్ పాయింట్‌లో పర్యాటక బోట్లను తనిఖీ చేశారు. బోట్లలో పర్యాటకులను సామర్థ్యానికి మించి ఎక్కించొద్దని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. బోట్ల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అతివేగంగా వాహనాలు నడపవద్దని, వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు తప్పకుండా కలిగి వుండాలన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



కోటనందూరు మండలం ఎస్‌ఆర్ పేట గ్రామంలో ఆకట్టుకున్న రంగవల్లులు



గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురంలో ప్రముఖ క్రికెటర్ భరత్‌ను సన్మానిస్తున్న దృశ్యం



తొండంగి మండలం ఏవీ నగరంలో షిర్డీ సాయినాథుని దర్శించుకుంటున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

## సంక్రాంతి సందడే సందడి

జగ్గంపేట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిశాల భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో 13వ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్న పిల్లలకు మ్యూజికల్ ఛైర్, స్లో సైక్లింగ్, లెమన్-స్పూన్ పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహింగా 65 మంది మహిళలు పాల్గొన్నారు. రాయి లక్ష్మి (ప్రథమ), ముత్త సౌందర్య (ద్వితీయ), శిరీష (తృతీయ) బహుమతులు అందుకున్నారు. మిగతా పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ యూత్ నాయకులు గొట్టుముక్కల రవివర్మ మాస్టారు, తొట్టిపూడి రాజా, మానేపల్లి గంగ, గుర్రపు శ్రీను, రాళ్ల పల్లి దానయ్య స్వామి, సుంకర శ్రీను, కొంకుడిపూడి వీరబాబు, నంద, హేమంత్ తేజ, సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**అన్నవరం (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో బుధవారం గోపూజోత్సవం నిర్వహించారు. కనుమ సందర్భంగా కళా మందిరం వద్ద గోవులను ఉంచి విశేష పూజలు జరిపారు. దేవస్థానం ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

**తొండంగి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఏవీ నగరంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పాల్గొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీసాయినాథుని సందర్శించి పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల కోలాట ప్రదర్శనను తిలకించి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలను కలుసుకున్నారు. గ్రామంలో అనారోగ్యానికి గురైన టీడీపీ సీనియర్ నేత యనమల రామారావును పరామర్శించారు. నేతలు యనమల రాజేష్, కొయ్యా శ్రీను, కొయ్యా రామకేశవ, కోడ వెంకటరమణ, కొయ్యా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**తుని రూరల్ (ఆంధ్రజ్యోతి):** సంస్కృతీ, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక అని తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్యస్పష్టం చేశారు. చేపూరులో గ్రామ పెద్దలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రికెట్, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ కొండ్ర నాగేశ్వరరావు, పక్కుర్తి శ్రీను, టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, కోడా వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, ఆవుగంటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వి.కొత్తూరు సమీపంలో టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి):** మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంప్రదాయంగా గ్రామాల్లో పెద్దలకు నూతన వస్త్రాలు బహూకరించారు. అల్లుళ్లు, కుమార్తెలు, బంధువులతో ప్రతి ఇంటా సందడి కనిపించింది. ప్రజలు హరిదాసుకు బియ్యం, సామగ్రి వితరణ చేశారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా పలుచోట్ల కోడి పందాలు, గుండాట జోరుగా నిర్వహించారు. ఇంటిల్లిపాదీ హౌసీ, అష్టాచెమ్మా ఆటలతో సందడిగా గడిపారు.

**గండేపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎన్టీ రాజాపురం గ్రామంలో టీడీపీ సీనియర్ నేత పరిమి బాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి పలు ఈవెంట్స్ ఏర్పాటు చేశారు. వచ్చిన వారందరికీ మూడు రోజులు విందు భోజనాలు పెట్టారు. అతిథిగా హాజరైన ప్రముఖ క్రికెటర్ కేఎస్ భరత్‌ను సత్కరించారు. వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సినీ నటి జ్యోతి, ఇతర సినీ ప్రముఖులు సందడి చేశారు.

**కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఇళ్లల్లో పెద్దలకు నైవేద్యాలు పెట్టుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి దర్శనాలు చేసుకున్నారు. సినిమా హాళ్లు, వివిధ ప్రాంతాలకు వెళ్లి సందడి చేశారు. కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లు కళకళలాడాయి. రకరకాల పిండి వంటలు చేసుకుని అందరికీ పంచిపెట్టారు.

**కోటనందూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎస్‌ఆర్‌పేటలో మనం-మన ఊరు కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కోటనందూరు, కేఈ చిన్నయ్యపాలెం, కాకరాపల్లి, జగన్నాథపురం, బిళ్లనందూరు, బొద్దవరం గ్రామాల్లోనూ ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ పోతల సూరిబాబు, గుడివాడ తాతబాబు, గుడివాడ రాజు, అన్నంరెడ్డి మహేష్, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రత్నగిరిపై గోపూజ నిర్వహిస్తున్న ఈవో సుబ్బారావు దంపతులు



జగ్గంపేట మండలం మల్లిశాలలో పలు పోటీల్లో విజేతలతో భగత్‌సింగ్ యూత్ సభ్యులు



తుని మండలం చేపూరులో ముగ్గును తిలకిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య



ఏలేశ్వరం మండలం సిరిపురంలో ఓ ఇంట్లో హౌసీ ఆడుతున్న దృశ్యం



నాటకోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

## 'కళలను ప్రోత్సహించడంలో ధర్మవరానికి ప్రముఖ స్థానం'

ప్రత్తిపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కళలు, కళాకారులను ప్రోత్సహించడంలో ధర్మవరం జిల్లాలో ప్రముఖ స్థానంలో ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా చెప్పారు. మండలంలోని ధర్మవరంలో గౌరీ శంకరుల 88వ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పండుగకు నిర్వహించే నాటకోత్సవాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 88 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. తొలిరోజు ప్రేమకు 18 ఏళ్ళు, దేవనర్తకి నాటక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



గడ్డిపేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

## 'గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం'

తొండంగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. మండలంలోని గడ్డిపేటలో ఉపాధి హామీ నిధులు రూ.6లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ, కొయ్యా శ్రీను, సూరిబాబు, చొక్కా అప్పారావు, కాలిబోయిన చంద్రరావు, అరిగెల నరసింహమూర్తి, కొండబాబు పాల్గొన్నారు.

## వైభవంగా సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కిర్లంపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.తిమ్మాపురం-తామరాడ రహదారిలో వేంచేసియున్న గుళ్ళ సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను బుధవారం ఆలయ కమిటీ సహకారంతో వైభవంగా నిర్వహించారు. తామరాడ గ్రామానికి చెందిన ఉల్లి చక్రధర్‌రావు-లావణ్య దంపతుల ఆధ్వర్యంలో జరిపించారు. అర్చకుడు సముద్రపు రామారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తామరాడ, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉల్లి మరిడియ్య, జాలా వీరలక్ష్మీ, గోకేడ శ్రీహర్ష, సత్యప్రియ, ఉమాదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర స్వామికి సమర్పించిన పిండి వంటలు, పండ్లు

## బసవేశ్వరునికి 108 రకాల పిండి వంటలతో నివేదన

ప్రత్తిపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో వేంచేసియున్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో బసవేశ్వరునికి కనుమ పండుగ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల పిండి వంటలు, పండ్లతో కలిపి నందీశ్వరునికి పూజలు జరిపారు. బసవేశ్వరస్వామిని పుష్పాలతో అలంకరించి రమణ సేవాశ్రమ నిర్వాహకుడు రామానంద ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

## ఘనంగా రావులమ్మ తల్లి ఉత్సవాలు



జగ్గంపేట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామ దేవత రావులమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ కాంతులతో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. బాణసంచా కాల్పులు, జానపద కళారూపాలు, గరగలు, శక్తివేషాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట సూరంపాలెం బాలు, రాజనాల శ్రీను వున్నారు.


Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA

DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA

BOOK ONLINE TICKETS Paytm

NOW SHOWING




Anand: DAKU MAHARAAJ : 8-10AM, 11-30AM, 2-30PM, 6-30PM,9-45PM
SANKRANTHIKI VASTHUNAM 8-15AM, 11-00AM, 11-45AM, 2-50PM 2-20PM, 6-00PM, 6-45PM, 9-15PM, 10-00PM
GAME CHANGER (TEL) : 8-00AM 11-10AM, 2-45PM, 6-10PM, 9-30PM

Devi: DAKU MAHARAAJ : 8-10AM, 11-10AM, 2-15PM 6-20PM, 9-15PM
SANKRANTHIKI VASTHUNAM 8-20AM, 11-20AM, 11-30AM 2-30PM, 4-00PM, 6-45PM, 7-00PM, 9-45PM, 10-00PM
GAME CHANGER : 8-30AM, 11-40AM, 2-45 PM, 6-00PM, 10-00PM